సాక్షి నల్లగొండ

శనివారం । 11 । నవంబర్ । 2023

I



నిరుద్యోగి వినూత్న ప్రచారం

కేసీఆర్‌కు ఓటు వేయొద్దని ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ కె.సత్యనారాయణ వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. - IIలో



రూ.10.18కోట్ల నగదు స్వాధీనం

'కోడ్' నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో రూ.10.18కోట్ల నగదు, రూ.27 కోట్ల విలువైన ఆభరణాలు పట్టుపడ్డాయి. - IIలో



తనయుడికి తోడుగా..

బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి జగదీష్ రెడ్డికి ఓటెయ్యాలని ఆయన తండ్రి చంద్రా రెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. - IIలో

న్యూస్‌రీల్

ఎంజీయూలో రెండు శాఖలకు కొత్త అధిపతులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వివిధ శాఖలకు నూతన అధిపతులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లను నియమిస్తూ శుక్రవారం ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. బయోటెక్నాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్, బయోటెక్నాలజీ శాఖాధిపతిగా డాక్టర్ మాధురి, బయో కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ ఎం. రామచందర్‌గౌడ్, శాఖాధిపతిగా డాక్టర్ తిరుమల నియమితులయ్యారు.

యాసంగి విత్తనాలు సిద్ధం

మిర్యాలగూడ అర్బన్: యాసంగి సాగుకు ఉమ్మడి జిల్లాలోని రైతులందరికీ సరిపడా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నందిపాడు బ్రాంచి జనరల్ మేనేజర్ సీహెచ్.కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ యాసంగికి వివిధ రకాల విత్తనాలను పీఏసీఎస్, ఏఆర్ఎస్‌కే, ఎఫ్ఎస్‌సీఎస్, డీసీఎంఎస్ పంపిణీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఇప్పటికే మినుములు, పెసలు, వేరుశనగ, శనగ, జీలుగ, వరి విత్తనాలను కేంద్రాలకు చేరవేశామని, కావాల్సిన రైతులు సంప్రదించాలని సూచించారు. విత్తనాభివృద్ధి సంస్థకు రైతులు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. అవి నాణ్యతగా ఉంటే బయటి మార్కెట్ కంటే క్వింటాకు 20శాతం అధిక ధరను చెల్లిస్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

శాలిగౌరారం: రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నిర్వాహకులకు సహకరించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు కోరారు. శాలిగౌరారం మండలం అడ్లూరు, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల దృష్ట్యా ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం వేళల్లో కుప్పలు చేసుకొని టార్పాలిన్లు, కవర్లతో కప్పుకొని భద్రపరుచుకోవాలన్నారు. ఆయనవెంట పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, కేంద్రాల ఇన్‌చార్జిలు శంకర్, జయరాజు, నరేశ్, మహేశ్ ఉన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠింపజేసి ఊంజలి సేవ నిర్వహించారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, ఆరాధన, అభిషేకం, ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు.



చండూరు : నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీతో వెళ్తున్న మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి



దాఖలైన మొత్తం నామినేషన్లు ఇలా..

నియోజకవర్గం	2023 అభ్యర్థులు	2023 సెట్లు	2018 అభ్యర్థులు	2018 సెట్లు
నల్లగొండ	39	72	24	40
నకిరేకల్	33	55	21	39
మునుగోడు	51	90	33	65
దేవరకొండ	18	34	20	35
నాగార్జునసాగర్	28	57	17	27
మిర్యాలగూడ	45	79	46	84
సూర్యాపేట	42	81	30	58
తుంగతుర్తి	33	48	27	42
హుజూర్‌నగర్	40	70	24	39
కోదాడ	39	66	27	41
ఆలేరు	31	49	28	51
భువనగిరి	29	44	19	38
మొత్తం	**428**	**745**	**316**	**559**

428 మంది.. 745 సెట్లు

నామినేషన్లు సమాప్తం

ఇక హోరెత్తనున్న ప్రచారం.. అస్త్రశస్త్రాలతో సిద్ధమైన అభ్యర్థులు

- ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో భారీగా నామినేషన్లు
- అత్యధికంగా మునుగోడులో 51, అత్యల్పంగా దేవరకొండలో 18మంది
- 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 112 మంది అధికం
- చివరి రోజు మునుగోడులో రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- 13న నామినేషన్ల పరిశీలన.. 15వ తేదీ వరకు ఉపసంహరణ

> అత్యధికంగా మునుగోడులో 51 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, అతి తక్కువగా దేవరకొండలో 18 మంది దాఖలు చేశారు
>
> 2018లో జరిగిన సాధారణ ఎన్నికలకంటే ఈసారి ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 316 మంది 559 సెట్‌ల నామినేషన్లు వేశారు. ఈసారి వాటి సంఖ్య భారీగా పెరిగింది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ప్రధాన ఘట్టాల్లో ఒకటైన నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ 10వ తేదీతో పరిసమాప్తమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చివరి రోజు పెద్ద ఎత్తున నామినేషన్లు వేశారు. గురువారం ఏకాదశి మంచిరోజు కావడంతో భారీ ఎత్తున నామినేషన్లు వేయగా.. శుక్రవారం కూడా అధికార పార్టీ అభ్యర్థులు, వారి కుటుంబీకులు, ఇతర అభ్యర్థులు అదనపు సెట్లతోపాటు, కొత్తగా అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. 12 నియోజకవర్గాల పరిధిలో 428 మంది 745 సెట్లు వేశారు.

అత్యధికంగా మునుగోడులో..

ఉమ్మడి జిల్లాలోనే మునుగోడు నియోజకవర్గంలో అభ్యర్థులు అధిక సంఖ్యలో నామినేషన్లను దాఖలు చేశారు. ఒక్క మునుగోడులో 51 మంది అభ్యర్థులు 90 నామినేషన్లు వేయగా, అతి తక్కువగా దేవరకొండలో నామినేషన్లు దాఖలు చేశారు. అక్కడ 18 మంది 34 సెట్లు వేశారు. మునుగోడులో 2018 ఎన్నికల్లో తక్కువగా నామినేషన్లు దాఖలు కాగా, 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో భారీగా నామినేషన్లు వేశారు. ప్రస్తుత ఎన్నికలతో పోల్చితే ఉప ఎన్నికల్లో దాఖలైన నామినేషన్ల సంఖ్యనే అధికం. అప్పుడు 130 మంది 199 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇక ఈసారి కూడా ఎక్కువ మంది ఉండటంతో మునుగోడు లో రాత్రి 7 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ (ఆర్‌వో కార్యాలయంలోకి 3 గంటలకు ముందే వచ్చిన వారివి) కొనసాగింది.

చివరి రోజు భారీగా..

చివరి రోజైన శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. 12 నియోజకవర్గాల్లో 276 మంది 358 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అందులో నల్లగొండలో 29 మంది 30 నామినేషన్లు దాఖలు చేశారు. నకిరేకల్‌లో 23 మంది 27 సెట్లు, మునుగోడులో 31 మంది 42 సెట్లు, దేవరకొండలో 13 మంది 15 సెట్లు, మిర్యాలగూడలో 32 మంది 38 సెట్లు, నాగార్జునసాగర్‌లో 8 మంది 27 సెట్లు, సూర్యాపేటలో 35 మంది 45 సెట్లు, తుంగతుర్తిలో 20 మంది 21 సెట్లు, హుజూర్‌నగర్‌లో 32 మంది 44 సెట్లు, కోదాడలో 26 మంది 27 సెట్లు, ఆలేరులో 14 మంది 25 సెట్లు, భువనగిరిలో 13 మంది 17 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



మిర్యాలగూడలో నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి



నల్లగొండలో భూపాల్‌రెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ నేతలు

13న పరిశీలన.. 15 వరకు ఉపసంహరణ

దాఖలైన నామినేషన్లను అధికారులు 13వ తేదీన స్క్రూటినీ(పరిశీలన) చేస్తారు. అన్ని పత్రాలు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఆ నామినేషన్ పత్రాలను పరిగణనలోకి తీసుకుంటారు. నిబంధనలకు అనుగుణంగా లేకపోతే తిరస్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగియనుంది. ఎవరైతే అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకుంటారో సంబంధిత రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లు ఉపసంహరించుకుంటున్నట్లు లేఖ అందించాల్సి ఉంటుంది. ఆరోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా ఉపసంహరించుకుంటున్నట్లు లేఖ అందించిన వారి నామినేషన్లు మాత్రమే ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటిస్తారు.

ఊపందుకోనున్న ప్రచారం

నామినేషన్ల పర్వం ముగియడంతో ఇక ప్రచారం హోరెత్తనుంది. అస్త్రశస్త్రాలతో అభ్యర్థులు పూర్తిస్థాయి ప్రచారంలోకి దూకనున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలు మొదటి విడత పూర్తి చేసి రెండో విడత కూడా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ.. మిర్యాలగూడ, తుంగతుర్తి, సూర్యాపేట నియోజక వర్గాల్లో అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించింది. ఆ నియోజకవర్గంలో ఆయా అభ్యర్థులు ఇప్పుడే రంగంలోకి దిగుతున్నారు. బీజేపీ, సీపీఎం, బీఎస్పీ అభ్యర్థులు, ఇండిపెండెంట్లు కూడా ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

12 స్థానాల్లో బీఆర్ఎస్‌దే విజయం

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

శాలిగౌరారం: ఈ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం బీఆర్ఎస్ తుంగతుర్తి అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. మేనిఫెస్టోను మించి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందిన పార్టీగా బీఆర్ఎస్ అని గుర్తు చేశారు. మూడోసారి బీఆర్ఎస్‌పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని, ప్రభుత్వం ఏర్పాటు కాగానే పేదలందరికీ పక్కా ఇల్లు నిర్మిస్తామని, రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రజల కోసం కాకుండా పదవుల కోసం పనిచేస్తారని విమర్శించారు. ఎవరెన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ మూడో సారి సీఎం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి, చాడ హతీష్‌రెడ్డి, చామల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో గాదరి కిశోర్, ఎంపీ బడుగుల లింగయ్య

కేసీఆర్ కుటుంబ పాలన అంతమొందించాలి

- బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్

నల్లగొండ టూటౌన్: నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంపదను దోచుకున్న కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించాలని బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. నల్లగొండ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం పాతబస్తీలోని హనుమాన్ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించా రు. అనంతరం పెద్ద గడియారం సెంటర్‌లో లక్ష్మణ్ మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలని, వీరికి మజ్లిస్ పార్టీ తోడయిందని ఆరోపించారు. రాష్ట్రంలో మజ్లిస్ పార్టీని తరిమికొట్టేందుకు బీజేపీకి అవకాశం ఇవ్వాలని, బీసీని సీఎం చేస్తామంటే ఇతర పార్టీల వారికి కడుపు మంటగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో దళితుడు, బీసీని సీఎం చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు గుణపాఠం చెప్పి నల్లగొండలో చరిత్ర సృష్టించాలని కోరారు. నల్లగొండ నియోజకవర్గంలో బహుజన బిడ్డగా మీ ముందుకు వచ్చిన మాదగాని శ్రీని వాస్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరా రు. బీజేపీ అభ్యర్థి శ్రీని వాస్‌గౌడ్ మాట్లాడుతూ 20 ఏళ్లు పాలించిన కోమటిరెడ్డి, ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న భూపాల్‌రెడ్డి నల్లగొండను అభివృద్ధి చేయలేదన్నారు. స్థానికుడిగా తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, కంకణాల నాగిరెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, బొజ్జ నాగరాజు, మునికుమార్, సాయి, ఆవుల మధు, పి.రవి, హరి, గణేష్ పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్, చిత్రంలో బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్



కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావుతో సమావేశమైన ఎన్నికల సాధారణ పరిశీలకులు

నల్లగొండకు జనరల్, పోలీస్ అబ్జర్వర్లు

నల్లగొండ: భారత ఎన్నికల కమిషన్ జిల్లాకు నియమించిన సాధారణ పరిశీలకులు (జనరల్ అబ్జర్వర్లు), పోలీస్ అబ్జర్వర్లు శుక్రవారం నల్లగొండకు చేరుకున్నారు. జనరల్ అబ్జర్వర్లు అవినాష్ చంపావత్, కె.బాలసుబ్రహ్మణ్యం, పోలీస్ అబ్జర్వర్ వినీత్ ఖన్నాలకు శుక్రవారం నల్లగొండలోని విద్యుత్ అతిథి గృహంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు కలెక్టర్, ఎస్పీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో చేసిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా నియోజవకవర్గాల వారీగా నియమితులైన అబ్జర్వర్ల ఫోన్ నంబర్లను కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఎవరైనా సరే స్వయంగా గాని కింది ఫోన్ నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

సాధారణ పరిశీలకులు వీరే..

పేరు	ఫోన్‌నంబర్	నియోజకవర్గాలు
కె.బాలసుబ్రహ్మణ్యం	8143880655	మునుగోడు, నకిరేకల్
కె.శ్రీనివాసులు	9948095101	మునుగోడు, నకిరేకల్
అవినాష్ చంపావత్	8143550654	మిర్యాలగూడ, నల్లగొండ
యాకూబ్‌అలీ	7036771554	మిర్యాలగూడ, నల్లగొండ
ఆర్.కన్నన్	8712200653	దేవరకొండ, నాగార్జునసాగర్
సయ్యద్ జిలానీ	8501061615	దేవరకొండ, నాగార్జునసాగర్

బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దెదించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు
- మిర్యాలగూడలో జూలకంటి రంగారెడ్డి నామినేషన్ దాఖలు

మిర్యాలగూడ: ప్రజా వ్యతిరేక విధానాలును అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దెదించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు పిలుపునిచ్చారు. మిర్యాలగూడలో సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశాన్ని దోచుకుతింటున్న మోదీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఏర్పడిందని, మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా మిత్రపక్షాలు పనిచేస్తున్నాయన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి ప్రభుత్వ సొమ్మును, ఆస్తులను కాజేస్తున్న కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీతో లోపాయికార ఒప్పందం ఉండడం వల్లే కేసీఆర్.. వామపక్షాలతో స్నేహాన్ని వదులుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో కొందరు నాయకుల కారణంగా ఆ పార్టీతో పొత్తు కుదరలేదన్నారు. సీపీఎంపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకుడైన జూలకంటి రంగారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా ఈ ప్రాంతంలో పేదల పక్షాన నిలిచి నిరంతరం రాజీలేకుండా పోరాడుతున్న జూలకంటి రంగారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు.

మోసగాళ్ల మాటలు నమ్మొద్దు : జూలకంటి

ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే మోసగాళ్ల మాటలను ప్రజలు నమ్మొద్దని సీపీఎం మిర్యాలగూడ అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. డబ్బు సంచులతో వచ్చి ఓట్లను కొని అధికారంలోకి రావాలని చూస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేసేందుకు, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తేందుకు అవకాశం కల్పించాలని కోరారు. జూలకంటి నామినేషన్ సందర్భంగా వివిధ మండలాల నుంచి సీపీఎం కార్యకర్తలు భారీగా తరలివచ్చి ర్యాలీ తీయడంతో మిర్యాలగూడలోని రోడ్లు ఎర్రజెండాలతో ఎరుపెక్కాయి. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వి.రమ, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రవినాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, నాయకులు లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, పాదూరి శశిధర్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశురాములు, వరలక్ష్మి, వినోద్‌నాయక్, సీతారాములు, గోవర్ధని, రొండి శ్రీనివాస్, బాలసైదులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధు, చిత్రంలో జూలకంటి రంగారెడ్డి

కబడ్డీ పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్: ఏపీలోని కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీలో ఈనెల 10 నుంచి 14 వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు నల్లగొండలోని ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంజీ యూనివర్సిటీ జట్టు తరఫున ఎంపికైనట్లు క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మందడి నర్సిరెడ్డి, బొమ్మపాల గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో ఎన్జీ కాలేజీలో డిగ్రీ చదువుతున్న కె.కోటేష్, చింత రవితేజ, హాలియా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు పేర్ల మధు, దుగ్యాల సందీప్, హైదరాబాద్‌లోని కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్న పిల్లి భరత్ ఉన్నట్లు పేర్కొన్నారు.



హుజూర్‌నగర్ : రోడ్ షోలో పాల్గొన్న కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మాట్లాడుతున్న ఉత్తమ్



మిర్యాలగూడ : జూలకంటి రంగారెడ్డి నామినేషన్ సందర్భంగా సీపీఎం ర్యాలీ

చివరిరోజు భారీగా..

జంగ్ తెలంగాణ



చందూరు : మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



తుంగతుర్తి : నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మందులు సామేలు



మిర్యాలగూడ : సీపీఎం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న జూలకంటి రంగారెడ్డి



సూర్యాపేట : నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు



హుజూర్‌నగర్ : నామినేషన్ వేస్తున్న సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి



హుజూర్‌నగర్ : నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి శ్రీలతారెడ్డి, పక్కన సినీ నటి జీవిత



భువనగిరి : నామినేషన్ వేసేందుకు వెళ్తూ తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న గూడూరు నారాయణరెడ్డి



దేవరకొండ : ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి



భువనగిరి : ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు



హుజూర్‌నగర్ : నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న పిల్లుట్ల రఘు

నామినేషన్లు వేసిన నిరుద్యోగులు

నిడమనూరు : అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఓటమే ధ్యేయంగా నిరుద్యోగ యువత పనిచేస్తుందని, అందులో భాగంగానే నిరుద్యోగ యువత తరుపున సాగర్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేసినట్లు నిరుద్యోగ యువత నాయకుడు గిరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన సాగర్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేసిన అనంతరం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, గ్రూప్స్ వాయిదాలతో ఎంతో మంది నిరుద్యోగులం మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న నోముల భగత్‌ను ఓడించి తమ సత్తా ప్రభుత్వానికి చాటుతామన్నాడు. రాష్ట్రంలో 81వేల మంది నిరుద్యోగులు తీవ్ర మనోవేదనతో ఉన్నారని, ప్రతిపక్ష పార్టీల్లో నిరుద్యోగ యువత తరుపున పోరాటం చేస్తున్న వారికి తమ మద్దతు ఉంటుందని, అందులో భాగంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు, నకిరేకల్‌లో వేముల వీరేశానికి సపోర్ట్ చేస్తామన్నారు. నామినేషన్లు పూర్తి కాగానే ఎక్కడెక్కడ తాము పోటీలో ఉండేది, ఎక్కడ ఇతరులకు మద్దతు ఇచ్చేది పూర్తిగా తెలుస్తుందన్నారు.

నకిరేకల్ : రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యపై పోరాడేందుకు నకిరేకల్‌లో ఓ నిరుద్యోగి నామినేషన్ వేశాడు. నియోజకవర్గంలో దాదాపు 40 వేల పైచిలుకు యువ ఓటర్లు ఉన్నారని.. నిరుద్యోగుల తరపున గొంతును వినిపించేందుకు ఈ ఎన్నికల్లో నామినేషన్ వేశానని నరేష్ తెలిపారు.



నామినేషన్ దాఖలు చేసి మాట్లాడుతున్న నిరుద్యోగి గిరిబాబు



నామినేషన్ దాఖలు చేస్తున్న కందుకుని నరేష్

నిరుద్యోగి వినూత్న ప్రచారం

- కంభంపాటి సత్యనారాయణ, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్

చండూరు : 'కేసీఆర్‌కు ఓటు వేయకండి.. ఒకవేళ వేశారో బిచ్చమెత్తుకోవడం (నా వేశాధారణ) ఖాయం. చెత్తులెత్తి దండం పెడుతున్నా కేసీఆర్‌కు ఓటు వద్దు' అంటూ ఓయూ పీహెచ్‌డీ స్కాలర్, మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన కంభంపాటి సత్యనారాయణ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం చిరిగిన చొక్కా, చినిగిన చిన్న లుంగీ, నెత్తికి గుడ్డ రుమాలు ధరించి, ఫ్ల కార్డులు, రెండు ఖాళీ బీరు సీసాలు, చేతిలో చిప్ప పెట్టుకొని ఓటర్లను అడుక్కుంటూ చండూరులోని నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో లిక్కర్‌కు ఎలాంటి లిటికేషన్‌లు ఉండవు.. ఉద్యోగాలకు అన్ని లిటికేషన్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అనేక ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల లాగా మన మునుగోడు ఎందుకు అభివృద్ధి జరుగడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వృద్ధులు మోసపోకండి.. మోసపోతే అందరం బిచ్చమెత్తుకోవాల్సిందేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 92 వేల ఉద్యోగాలు భర్తీ చేయడం అటుంచితే.. 9 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. అనంతరం ఆయన మునుగోడు అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.



కారు గుర్తుకు ఓటు వేస్తే.. బిచ్చమెత్తుకోవడమే అంటూ ప్రచారం నిర్వహిస్తున్న సత్యనారాయణ

మంత్రి జగదీష్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.4.26 కోట్లు

సూర్యాపేట : బీఆర్‌ఎస్ సూర్యాపేటఅభ్యర్థి, రాష్ట్ర మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గురువారం వేసిన నామినేషన్‌లో తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం రూ.1.58 కోట్ల స్థిర ఆస్తులు, రూ.2.68 కోట్ల చరాస్తులు మొత్తం కలిపి రూ.4.26 కోట్లు ఉన్నాయని.. రూ.2.60 లక్షల అప్పు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన చేతిలో రూ.2.86 లక్షలు ఉన్నట్లు తెలిపారు. తన సతీమణి సునీత చేతిలో రూ.9.8 లక్షలు ఉండగా.. ఆమె పేరున రూ.5.94 కోట్ల స్థిరాస్తులు, రూ.4.66 కోట్ల చరాస్తులు, 500 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయని.. రూ.3.27 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఆయన పేరున ఒక కారు, తన సతీమణి పేరున రెండు కార్లు, ఒక బైక్, ట్రాక్టర్ ఉన్నట్లు చూపారు. తనపై ఒక కేసు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

సంకినేని కుటుంబ ఆస్తి రూ.22.63 కోట్లు

సూర్యాపేట : బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ఉమ్మడి కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను రూ.22.63 కోట్లుగా చూపారు. వెంకటేశ్వర్‌రావు పేరున రూ.1.51 కోట్ల చరాస్తులు, రూ.40 లక్షల స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. అప్పులు రూ.1.50 కోట్ల అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన సతీమణి లక్ష్మి చేతిలో రూ.13.75 లక్షలు ఉండగా.. 730 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.25.32 కోట్ల చరాస్తులు ఉన్నట్లు చూపారు. తనపై నాలుగు కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు.

దామోదర్‌రెడ్డిపై నాలుగు కేసులు..

సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి రూ.13.94 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.2.88 కోట్ల స్థిరాస్తులు తన చేతిలో రూ.25 వేలు ఉన్నట్లు పేర్కొన్నారు. తనపై నాలుగు పెండింగ్ కేసులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు.

తనయుడికి ఓటెయ్యాలని తండ్రి ప్రచారం

సూర్యాపేట : విద్యుత్‌శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ తండ్రి గుంటకండ్ల చంద్రారెడ్డి శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. చంద్రారెడ్డి ఎనిమిది పదుల వయస్సులోనూ 18వ వార్డులో గడపగడపకు తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మహిళా నేతలతో కలిసి చంద్రారెడ్డి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సూర్యాపేటలో జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.



సూర్యాపేటలో కారుకు ఓటు వేయాలని మహిళను కోరుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి తండ్రి చంద్రారెడ్డి

బైండోవర్ అంటే..



భువనగిరి : ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పాత నేరస్తులు, రౌడీషీటర్లను ముందస్తుగా బైండోవర్ చేస్తారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో ఉన్న బెల్టుషాపులు నిర్వహించే వారిని సైతం బైండోవర్ చేస్తున్నారు. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా.. వారి చర్యలపై అనుమానాలు వచ్చినా.. అలాంటి వ్యక్తులను పోలీసులు తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. చట్టవ్యతిరేక పనులు, చర్యలు చేపట్టనని బాండు పేపర్‌పై లిఖిత పూర్వకంగా తీసుకుని సొంత పూచికత్తుపై విడుదల చేస్తారు. ఈ ప్రక్రియనే బైండోవర్ (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అంటారు. ఈ హామీ తర్వాత కూడా తప్పు చేస్తే 24 గంటల్లో సదరు వ్యక్తిని అరెస్ట్‌చేసి భారతీయ శిక్షా స్మృతి 107,108,109,110 సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు.

బస్వాపురం భూ నిర్వాసితుల తరఫున నామినేషన్



నామినేషన్ పత్రంతో బీఎస్ తిమ్మాపురం గ్రామస్తులు

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా బీఎస్ తిమ్మాపురం గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ భూ నిర్వాసితుల తరపున ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ జిన్న మల్లేష్ శుక్రవారం ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్వాపురం రిజర్వాయర్‌లో బీఎస్ తిమ్మాపురం పూర్తిగా ముంపునకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో అధికారులు భూ నిర్వాసితుల నుంచి భూమిని తీసుకునేటప్పుడు కబ్జాలో ఉన్న వారికి డబ్బులు ఇస్తామని చెప్పి, తీరా అవార్డు ప్రకటించే సమయంలో పట్టా ఉన్నవారికి మాత్రమే అని చెప్పడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రభుత్వం సరైన విధంగా భూ నిర్వాసితులకు న్యాయం చేయలేదని మండి పడ్డారు. ఆయన వెంట జిన్న కిష్టయ్య, లింగాల పాండు, తోటకూర పాండు , జిన్న బాలయ్య, జిన్న నరసింహ, పీన్నం అంజనేయులు, తోటకూర రమేష్, రావుల శీను, బిచ్చల ఎల్లేష్, ఇండ్ల మహేష్ పాల్గొన్నారు.

రూ.10.18కోట్ల నగదు స్వాధీనం

- 35 కిలోల బంగారం, 197 కేజీల వెండి కూడా..
- మొత్తంగా 27కోట్ల విలువైన ఆభరణాలు పట్టివేత

నల్లగొండ క్రైం : ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రూ.10.18కోట్ల నగదు, రూ.27కోట్ల విలువైన ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర సరిహద్దులో మూడు చెక్ పోస్టులతో పాటు జిల్లాలో మరో 10 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేస్తున్నారు. రూ 50వేలకు మించి ఆధారాలు లేకుండా తరలించే నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. మొత్తంగా రూ. 10.18కోట్ల నగదు, రూ.20లక్షల విలువైన మద్యం, రూ.12.50లక్షల విలువైన గంజాయి. 35 కిలోల బంగారం, 197 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ప్రతి రోడ్డులో చెక్ పోస్టు పెట్టి వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

రంగంలోకి కేంద్ర బలగాలు

ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు నాలుగు కేంద్ర కంపెనీ బలగాలు విధులు నిర్వహిస్తున్నాయి. ఒక్కో కంపనీలో 160 మంది సిబ్బంది ఉంటారు. 1200 మంది జిల్లాకు చెందిన పోలీస్ బలగాలు ఎన్నికల విధుల్లో ఉన్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర సరిహద్దు వాడపల్లి, అడవిదేవులపల్లి, సాగర్ వద్ద చెక్ పోస్టులతోపాటు జిల్లా లోపల పలు చెక్ పోస్టులు పెట్టి తనిఖీలు చేస్తున్నాం. నగదు, మద్యం, గంజాయి, బంగారం, ఇతర విలువైన వస్తువులు తరలించకుండా నివారిస్తున్నాం.

'కోడ్' ఉల్లంఘనలపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

నల్లగొండ క్రైం: ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉల్లంఘనపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల పోలీస్ పరిశీలకులు విజయ్‌సింగ్ మీనా, వినీత్ ఖన్నా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల ప్రజలు విజయ్‌సింగ్ మీనా (8143880657), మిర్యాలగూడ, నాగార్జున సాగర్, దేవరకొండ నియోజకవర్గాల ప్రజలు వినీత్ ఖాన్నా (8143780656) ఫోన్ నంబర్లను సంప్రదించి ఎన్నికల కోడ్ ఉల్లంఘులపై సమాచారం ఇవ్వాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



సుందరమూర్తి (ఫైల్)

పెద్దవూర : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుకనుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని వెలసందూర్ మండలం బద్దనగాంపట్టి గ్రామానికి చెందిన కలియప్పన్ సుందరమూర్తి(40) రెండు సంవత్సరాలుగా మండల కేంద్రంలోని బోగ్ మల్లా కాటన్ ఇండస్ట్రీలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. గురువారం రాత్రి సుందరమూర్తి ఇండస్ట్రీలో పని ముగించుకుని మిల్లు నుంచి తన స్నేహితులతో కలిసి నడుచుకుంటూ మండల కేంద్రానికి కిరాణ సామగ్రి కోసం వచ్చారు. సామాన్లు తీసుకుని తిరిగి జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై నడుచుకుంటూ మిల్లు వద్దకు వెళ్తుండగా పీఏపల్లి మండలం వద్దిపట్ల గ్రామానికి చెందిన పుట్టపాక ఏడుకొండలు తన ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ వచ్చి సుందరమూర్తిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో సుందరమూర్తి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడు అవివాహితుడని, తల్లిదండ్రులు కూడా లేరని తెలిసింది. మృతుడి స్నేహితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బీబీనగర్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45నుంచి 50సంవత్సరాలు కలిగి ఉన్న వ్యక్తి కిలో మీటర్ 226 ఎగువ లైన్ వద్ద గుర్తుతెలియని రైలు కింద పడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడి దుర్మరణం

హాలియా : రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందగా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది.త్రిపురారం మండలంలోని మునగబాయిగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన మహేష్ తన భార్య శైలజ, ఏడాదిన్నర వయసు గల కుమారుడు సందీప్‌తో కలిసి బైక్‌పై అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామంలో అత్తగారింటికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామమైన మునగబాయిగూడెం బయలుదేరారు. మార్గమధ్యలో పంగవానికుంట గ్రామ శివారులో రోడ్డుపై వెళ్తున్న వీరి ద్విచక్రవాహనాన్ని హాలియా నుంచి సాగర్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడాదిన్నర బాలుడు గుండెబోయిన సందీప్‌తో పాటు భార్య,భర్తలు గుండెబోయిన మహేష్, శైలజకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుండెబోయిన శైలజ(23), ఏడాదిన్నర కుమారుడు సందీప్‌ను 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. గాయపడిన గుండెబోయిన మహేష్‌ను చికిత్స నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతల వెంకన్న(47) గత నెల 17న తన ద్విచక్రవాహనంపై నల్లగొండ నుంచి తిప్పర్తి వైపు వెళ్తుండగా మల్లేపల్లివారిగూడెం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. అప్పటి నుంచి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం మృతుడి బావమరిది కొమ్మనబోయిన శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.ధర్మా తెలిపారు.